క్లుప్తంగా

వైభవంగా శ్రీవారి బ్రహ్మోత్సవాలు



పులుగుర్తలో స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులకు అభిషేకాలు చేస్తున్న పండితుడు

అనపర్తి: పులుగుర్తలో వేంచేసి ఉన్న శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి వారి 13వ వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా మూడో రోజు శుక్రవారం ఉదయం అష్ట కలశస్థాపన, అష్టోత్తర శత ఘటాభిషేకం, పంచామృతాలతో మూలవిరాట్‌కు అభిషేకాలు, సాయంత్రం నిత్య హోమాది క్రతువులు చేశారు. వేదపండితుడు పెదపూడి రఘురామ్ ఆధ్వర్యంలో ఆలయ అర్చకుడు పెద్దింటి శేషాచార్యులు పర్యవేక్షణలో ఈ పూజలు జరిగాయి.

రబీ సాగుకు నీటి ఎద్దడి రాకుండా చర్యలు

అనపర్తి: రబీలో శివారు ఆయకట్టు వరకూ సాగునీటి ఎద్దడి రాకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు బిక్కవోలు ఇరిగేషన్ జేఈ సజని తెలిపారు. శుక్రవారం స్థానిక గ్రామ సచివాలయం–5లో వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేఈ మాట్లాడుతూ పంటకు ఎటువంటి నీటి ఎద్దడి లేదని, ప్రణాళికాబద్ధంగా నీరు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. దీనికి అధ్యక్షత వహించిన వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పడాల శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష కార్యక్రమంలో సర్వేకు ఏవైనా అభ్యంతరాలు వస్తే సత్వరమే రెవెన్యూ, సర్వే సిబ్బంది స్పందించి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేయాలని కోరారు. తహసీల్దార్ కె.శశిధర్, మండల వ్యవసాయాధికారి బి.సురేష్‌కుమార్ మాట్లాడుతూ రైతులంతా తప్పనిసరిగా పంట నమోదు చేయించుకోవాలని సూచించారు. హార్టికల్చర్ అధికారి దివ్యశ్రీ, అగ్రికల్చరల్ అసిస్టెంట్ శరత్ తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో 325 మందికి ఉద్యోగాలు



అభ్యర్థులను ఇంటర్వ్యూ చేస్తున్న దృశ్యం

రాజానగరం: వికాస సంస్థ సహకారంతో స్థానిక దివ్య విద్యాసంస్థల ఆధ్వర్యంలో శుక్రవారం రాజానగరంలో నిర్వహించిన జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. ఐసీఐసీఐ, ఇసుజు, కాగెన్, సమీరా ఆగ్రో, ఐడీఎఫ్, హెల్ప్ యువర్ నీడ్స్, ఎస్‌బీఐ లైఫ్, గోపాల్ ఆటో మొబైల్స్ తదితర 20 కంపెనీలు నిర్వహించిన ఈ జాబ్‌మేళాకు గోదావరి జిల్లాల నుంచి 750 మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఇంటర్వ్యూల అనంతరం వారిలో 325 మందిని వివిధ ఉద్యోగాలకు ఎంపిక చేశారు. వారికి విద్యాసంస్థల ప్రతినిధి బర్ల సత్యనారాయణ చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేశారు.

కుట్టుశిక్షణ ప్రారంభం



టైలరింగ్‌లో శిక్షణ పొందుతున్న మహిళలు

రాజానగరం: డాక్టర్ వినయ్ సుంకర ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎంపిక చేసిన 60 మంది పేద మహిళలకు శుక్రవారం కుట్టుశిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. దివాన్‌చెరువులోని ఫౌండేషన్ కార్యాలయంలో జరుగుతున్న ఈ కార్యక్రమానికి చక్రద్వారబంధానికి చెందిన ఈవూరి దుర్గ శిక్షకురాలిగా వ్యవహరిస్తున్నారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు సుంకర నాగేశ్వరరావు, సుంకర వీరాస్వామి పాల్గొన్నారు.

స్త్రీనిధి బ్యాంకు డైరెక్టర్‌కు సన్మానం



లక్ష్మీప్రసన్నను సన్మానిస్తున్న దృశ్యం

రాజానగరం: జిల్లా స్త్రీనిధి బ్యాంకు డైరెక్టర్‌గా ఎంపికైన మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు ఐనవిల్లి లక్ష్మీప్రసన్నను మండల మహిళ సమాఖ్య ప్రతినిధులు, వీవోఏలు శుక్రవారం ఘనంగా సన్మానించారు. స్థానిక వెలుగు ప్రాజెక్టు కార్యాలయంలో ఏపీఓ హేమనాగలక్ష్మి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. లలిత, దేవి, విజయ, జ్యోతి, సత్యనారాయణమ్మ, దేవి పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలే శ్రీరామరక్ష

- వ్యవసాయ అధికారుల సూచనలతో మేలు
- తద్వారా వరిలో అధిక దిగుబడులు
- రెండు నియోజకవర్గాల్లో 57,442 ఎకరాల్లో సాగు

పెదపూడి: సాగులో సస్యరక్షణ చర్యలే పంటలకు శ్రీరామరక్ష.. తద్వారా అధిక దిగుబడులు సాధించేందుకు వీలుంటుంది.. రబీలో సమగ్ర సస్యరక్షణ, యాజమాన్య పద్ధతులను పాటించాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. వరిని ఆశించే చీడపీడల నివారణకు ఇవి తోడ్పడతాయని వివరిస్తున్నారు. అనపర్తి, రాజానగరం నియోజకవర్గాల్లోని ఏడు మండలాల్లో ఈ రబీ సీజన్‌లో 57,442 ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. మండలాల వారీగా పరిశీలిస్తే.. అనపర్తిలో 12 వేలు, పెదపూడిలో 18 వేలు, బిక్కవోలులో 13 వేలు, రంగంపేటలో 2 వేలు, రాజానగరంలో 8,060, కోరుకొండలో 2,465, సీతానగరంలో 1,917 ఎకరాల్లో సాగవుతుంది. పెదపూడి మండలంలో వరి పంట ప్రస్తుతం పిలకలు, దుబ్బు చేసే దశలో ఉంది. పొట్టకుళ్లు తెగులు చింతపల్లి, కుమారప్రియం, కరకుదురు తదితర గ్రామాల్లో, కాండం తొలుచు తెగులు గండ్రేడు, పుట్టకొండ, పెదపూడి గ్రామాల్లో, పొడ తెగులు శహపురం, కైకవోలు, పెద్దాడ తదితర గ్రామాల్లో పంటలపై కనిపిస్తుంది. వీటి నివారణ చర్యలను పెదపూడి మండల



పెదపూడిలో తెగుళ్ల నివారణకు పురుగు మందులు పిచికారీ చేస్తున్న రైతులు

వ్యవసాయశాఖ అధికారి టీవీఆర్ మణిదీప్ తెలిపారు. అవి ఇలా..

పొట్టకుళ్లు తెగులు

పొట్టను అంటి పెట్టుకుని ఉన్న ఆకు పైభాగంపై ప్రథమ లక్షణాలు కనిపిస్తాయి. నిర్దిష్ట ఆకారం లేని మచ్చలు ఏర్పడి, చుట్టూ ముదురు గోధుమ రంగులో ఉండి మధ్యలో బుడిద వర్ణం కలిగి ఉంటుంది. మచ్చలు ఒకదానితో ఒకటి కలసి పొట్ట అంతా వ్యాపించి వెన్ను బయటకు రాకుండా లోపల కుళ్లిపోతుంది. దీని నివారణకు పొలంలో ఒకసారి సుడోమోనాస్ సిలీంద్రనాశిని పిచికారీ చేయాలి. సస్యరక్షణకు ప్రొఫికోనోజోల్ 1 మిల్లీ లీటరు లేదా కార్బండిజమ్ 25 శాతం, మాంకోజబ్ 50 శాతం మిశ్రమాన్ని రెండు గ్రాములు తీసుకుని లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

కాండం తొలుచు పురుగు

ఈ పురుగులు వరి పంటలో పిలకలు పెట్టే దశ నుంచి, చిరుపొట్ట దశ వరకూ ఆశిస్తాయి. పిలకల దశలో ఆశిస్తే మొవ్వు చనిపోతుంది. దీని నివారణకు నాటడానికి ముందు నారు కొనలు, చివర్లు తుంచి గుడ్ల సముదాయాన్ని నాశనం చేయాలి. సాయంత్రం వేళల్లో పొలం గట్లపై మంటలు వేసి తల్లి పురుగులను నాశనం చేయాలి. పొలం గట్లపై పసుపు రంగు పూల మొక్కలను బంతి, చామంతి నాటడంతో తల్లి పురుగులు ఆకర్షించబడి తమ గుడ్లను పుష్పాలలో పెట్టడంతో ప్రధాన పొలంలో పురుగు ఉధృతిని గణనీయంగా తగ్గించవచ్చు. పిలకలు పెట్టే దశ నుంచి చిరుపొట్ట దశ వరకూ క్లోరాంత్రనిలిప్రోలు 0.4 శాతం (ఫెర్టారా) గుళికలు ఎకరాకు నాలుగు కిలోల చొప్పున వేసుకోవాలి. తల్లి



పుట్టకొండలో పంటపై కాండం తొలుచు పురుగు తెగులును పరిశీలిస్తున్న ఏఓ టీవీఆర్ మణిదీప్

పురుగు ఎక్కువగా ఉన్నప్పుడు క్లోరాంత్రనిలిప్రోలు 18.5 శాతం (కోరాజిన్) ఎకరాకు 60 మిల్లీలీటర్లు పిచికారీ చేయాలి.

పొడతెగులు నివారణకు..

వరి మొక్క పిలకలు పెట్టే దశ నుంచి ఎప్పుడైనా పొడ తెగులు ఆశించవచ్చు. నివారణకు గడ్డిజాతి కలుపు మొక్కలను తీసి వేసి పొలం గట్లు శుభ్రంగా ఉండేలా చూడాలి. అజాక్సి స్ట్రోబిన్ 25 ఎస్‌సీ (అమిస్టర్) ఒక లీటరు నీటికి ఒక మిల్లీ లీటరు చొప్పున కలిపి పిచికారీ చేయాలి. లేదా అజాక్సిస్ట్రోబిన్ 11 శాతం, టేబుకొనజోల్ 18.3 ఎస్‌సీ (కస్టోడియా) ఒక లీటరు నీటికి 1.5 మిల్లిలీటరు చొప్పున కలిపి వేయాలి.

మార్చి 3న రామాలయం ప్రారంభోత్సవం



పోస్టర్ విడుదల చేస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

రాజానగరం: మండలంలోని సీతారామపురంలో రూ. 32 లక్షల తిరుమల తిరుపతి దేవస్థానం నిధులతో పాటు గ్రామస్తుల సహకారంతో నిర్మించిన కోదండ రామాలయాన్ని మార్చి 3న ప్రారంభించనున్నారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా శుక్రవారం ఆవిష్కరించారు. ఈ ఆలయంలో దేవతామూర్తుల విగ్రహాల ప్రతిష్ఠోత్సవ కార్యక్రమాలు మార్చి ఒకటి నుంచి మురారి శర్మ ఆధ్వర్యంలో ప్రారంభమవుతాయని వైఎస్సార్ సీపీ నాయకుడు అడబాల చినబాబు తెలిపారు.

15న మండల సమావేశం

మధురపూడి: కోరుకొండ మండల పరిషత్ సమావేశం 15న జరుగుతుందని ఎంపీడీఓ నరేష్‌కుమార్ తెలిపారు. స్థానిక కాపవరం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ వీరవెంకట సత్యసూర్యకుమారి అధ్యక్షతన మధ్యాహ్నం 2 గంటలకు సమావేశం జరుగుతుందన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో పేదలకు అన్యాయం

సీతానగరం: కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ పేదలకు అనుకూలంగా లేదని సీపీఐ ఎంఎల్ రాష్ట్ర కమిటీ మెంబర్ పలివెల వీరబాబు అన్నారు. సీతానగరంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యావసరాల ధరలు విపరీతంగా పెరిగాయని, వాటిని తక్షణమే తగ్గించి పేదలకు న్యాయం చేయాలన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేటీకరణను ఉపసంహరించుకోవాలని, విశాఖ రైల్వేజోన్‌గా ప్రకటించాలని, పెట్రోల్ డీజిల్, వంట గ్యాస్ ధరలు తగ్గించాలన్నారు. నందమూరి చిట్టిస్వామి, సిద్దె



కేంద్రబడ్జెట్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న వీరబాబు తదితరులు

నాగరాజు, పలివెల జ్యోతి, తెలగరావు రమేష్, మొర్త చిన్నిబాబు, పెనుమెల్ల సుబ్బారావు పాల్గొన్నారు.

ఆశాజనకంగా నువ్వుల సాగు

రంగంపేట: మండలంలో నువ్వుల సాగు ప్రస్తుతం ఆశాజనకంగా కనిపిస్తుంది. గతంలో అధిక శాతం ఈ సాగును మెట్ట రైతులు వేసేవారు. ధర ఆశించిన స్థాయిలో ఉండకపోవడంతో సాగును తగ్గించేశారు. ప్రస్తుతం కొద్దిమంది మాత్రమే తమ అవసరాలకు వాడుకొనేందుకు పంట వేస్తున్నారు. ప్రస్తుతం మండలంలో సుమారు 125 ఎకరాలలో సాగవుతోంది. పంట పూత, పిందె, కాయలతో కళకళలాడుతుంది. ఈ దశలో అక్కడక్కడా పంటపై చిన్న పురుగు ఆశించే అవకాశం ఉందని, దానికి క్లోరోపైరీఫాస్ 2.1 ఎంఎల్ లీటర్ నీటిలో కలిపి



రంగంపేటలో కళకళలాడుతున్న నువ్వుల పంట

పిచికారీ చేయాలని మండల వ్యవసాయాధికారులు సూచించారు.

బ్యాంకు ఖాతాలో నగదు మాయం

బిక్కవోలు: తన బ్యాంకు ఖాతా నుంచి నగదు మాయమైందని ఓ వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై పి.బుజ్జిబాబు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ బలభద్రపురం గ్రామానికి చెందిన సబ్బెళ్ల సుధాకర్‌రెడ్డి మూడు బ్యాంకు అకౌంట్‌ల నుంచి మూడు సార్లు రూ.47 వేల నగదు మాయమైందని ఫిర్యాదు చేశారన్నారు. దీనిపై దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

నేటి నుంచి క్రీడా పోటీలు

రంగంపేట: మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు నల్లమిల్లి గ్రామంలోని గ్లోబల్ విజన్ స్కూల్ కరస్పాండెంట్ జాన్ డీన్ అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ పాఠశాల ఆవరణలో శనివారం నుంచి కబడ్డీ, వాలీబాల్, చెస్, క్యారమ్స్ పోటీలు నిర్వహిస్తామన్నారు. దీనికి ప్రవేశం ఉచితమని తెలిపారు.

భర్త వేధింపులపై కేసు

బిక్కవోలు: తన భర్త వేధిస్తున్నట్లు ఓ మహిళ ఫిర్యాదు చేసిందని ఎస్సై పి.బుజ్జిబాబు తెలిపారు. పందలపాకకు చెందిన బత్తుల నిర్మల తన భర్త సూరిబాబు శారీరంగా, మానసికంగా వేధింపులకు గురిచేస్తున్నట్లు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేశారు. అలాగే వేగంగా వాహనాలు నడుపుతున్న ఆరుగురు యువకులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై బుజ్జిబాబు తెలిపారు.

ఘనంగా శాంతి కల్యాణం

బిక్కవోలు: పందలపాక గ్రామ వెలమపేట రామాలయం వద్ద సీతారాములకు శాంతి కల్యాణం ఘనంగా నిర్వహించారు. శుక్రవారం ఆలయ వార్షికోత్సవం సందర్భంగా అర్చకులు గరిమెళ్ల సత్యప్రకాష్ ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన సబ్బారపు శివసత్యదుర్గ వరప్రసాద్, శ్రీవిద్య దంపతులు పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. మహిళలు భజనలు చేశారు. అనంతరం అన్న సమారాధన జరిగింది. సర్పంచ్ సబ్బారపు పద్మావతి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు సబ్బారపు సూర్యనారాయణ, ఆలయ కమిటీ చైర్మన్ చీపురపల్లి ఆనందరావు, వైఎస్సార్ సీపీ జేఏసీ మండల కన్వీనర్ బోడ్డు ముత్యాలరావు తదితరులు పాల్గొన్నారు.



పందలపాకలో శాంతి కల్యాణం చేస్తున్న కల్యాణకర్తలు

పౌష్టికాహారం కిట్ల పంపిణీ

గోకవరం: రాష్ట్ర, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు మండలంలోని పలువురు దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు శుక్రవారం గోకవరంలో పౌష్టికాహారం కిట్లు పంపిణీ చేశారు. చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్స్ స్కీమ్, స్నేహ లైఫ్ కేర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 35 మందికి ఒక్కొక్కరికీ రూ. 500 విలువ గల పౌష్టికాహారం కిట్లును స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు దాసరి రమేష్, సుంకర వీరబాబు, వరసాల ప్రసాద్ అందజేశారు. వ్యాధిగ్రస్తులు పాటించాల్సిన ఆరోగ్య సూత్రాలను వివరించారు. కార్యక్రమంలో స్నేహ లైఫ్ కేర్ ఫౌండేషన్ అధ్యక్షుడు జగ్వీందర్ సింగ్, వైఎస్సార్ సీపీ టౌన్ కన్వీనర్ చింతల అనిల్‌కుమార్, ఎంపీహెచ్‌ఈఓ వైఎస్ రాయుడు, చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్స్



గోకవరంలో రోగులకు పౌష్టికాహారం కిట్లు పంపిణీ చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

స్కీమ్ డీఆర్పీ రాజశేఖర్, సూపర్‌వైజర్ రామకృష్ణ, లింక్ వర్కర్ సూర్యకుమారి, లాజర్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల పవిత్రతను కాపాడాలి



ధర్మకర్తల మండలి సభ్యులను సత్కరిస్తున్న ఎమ్మెల్యే రాజా తదితరులు

- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- పాలక మండలి సభ్యులకు అభినందన

రాజమహేంద్రవరం సిటీ: మన ఆధ్యాత్మిక వారసత్వ సంపద అయిన ఆలయాల పవిత్రతను కాపాడటానికి ధర్మకర్తల మండలి సభ్యులు కృషి చేయాలని రాజానగరం ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా పిలుపునిచ్చారు. అన్నవరం వీర వెంకట సత్యనారాయణ స్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యురాలిగా ప్రమాణ స్వీకారం చేసిన తాడి రజని, ద్వారకా తిరుమల ధర్మకర్తల మండలి సభ్యురాలిగా ప్రమాణ స్వీకారం చేసిన నాళం కృష్ణ వీర సుబ్బలక్ష్మి శుక్రవారం రాజమహేంద్రవరంలో ఎమ్మెల్యే రాజాను మర్యాద పూర్వకంగా కలుసుకుని కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా రాజా మాట్లాడుతూ కష్టపడి పనిచేసే వారికి వైఎస్సార్ సీపీలో ఎల్లప్పుడూ గుర్తింపు ఉంటుందన్నారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడానికి పార్టీ పరంగా చేపడుతున్న కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. అనంతర పాలక మండలి సభ్యులను ఎమ్మెల్యే రాజా సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

1,012 మందికి వైద్య సేవలు

సీతానగరం: ఉండేశ్వరపురం సచివాలయంలో శుక్రవారం ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని సర్పంచ్ మాకాల ఈశ్వరరావు, ఎంపీటీసీ మట్టా వెంకట రమణ ప్రారంభించారు. 1,012 మంది రోగులకు పీహెచ్‌సీ డాక్టర్ రాజు వైద్యసేవలు అందించారు. మంచంపై ఉన్న రోగుల ఇంటికి నేరుగా వెళ్లి చికిత్స చేశారు. ఎంపీపీ స్కూల్ విద్యార్థులకు వ్యక్తిగత, పరిసరాల శుభ్రతపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ సెంటర్‌ను సందర్శించి పిల్లలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో రాధాకృష్ణ, హెల్త్ సూపర్‌వైజర్ సూర్యకుమారి, హెల్త్ అసిస్టెంట్లు స్వామి,



ఉండేశ్వరపురంలో వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ రాజు

రూప్‌కుమార్, ఏఎన్ఎం పద్మావతి, ఎంఎల్‌హెచ్‌పీ మౌనిక, ఆశవర్కర్లు కుమారి, లక్ష్మి పాల్గొన్నారు.

కేంద్ర పథకాలపై పరిశీలన

బిక్కవోలు: మండలంలో ఆరికరేవుల, రంగాపురం గ్రామంలో కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖకు చెందిన నేషనల్ లెవిల్ మోనిటరింగ్ (ఎన్ఎల్ఎం) సర్వే టీం సభ్యులు పి.పైడిరాజు, పి.విజయరాజు పర్యటించారు. గ్రామంలో కేంద్ర పథకాల లబ్ధిదారులు నుంచి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా పైడిరాజు మాట్లాడుతూ కేంద్ర ప్రాయోజిత పథకాలు అమలు తీరును పరిశీలించామన్నారు. ఈ నివేదికను ఉన్నతాధికారులకు పంపిస్తామని తెలిపారు. ఎంపీడీవో జేఏ ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ జామ్.. ఇక్కడ సాధారణం

- రాజానగరంలో ట్రాఫిక్ అవస్థలు
- రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు

రాజానగరం: నియోజకవర్గ కేంద్రమైన రాజానగరంలో నిత్యం ట్రాఫిక్ సమస్య ప్రజలను వేధిస్తూనే ఉంది. పాలకులు మారినా, అధికారులు మారినా ఇది వీడని సమస్యగా తయారైంది. ముఖ్యంగా గాంధీ బొమ్మ సెంటర్ నుంచి అటు సత్రం, ఇటు బస్టాండ్ వరకు వ్యాపారుల ఆక్రమణలు పెరిగిపోవడంతో 40 అడుగుల రోడ్డు సైతం 20 అడుగులకు కుదించుకుపోయింది. రోడ్డుపైకి వచ్చిన దుకాణాలతో పాటు వాటి ముందు పార్కింగ్‌లు కూడా తోడవడంతో ఈ సమస్య వస్తుందని అందరికీ తెలిసిన విషయమే అయినా పరిష్కార చర్యలు తీసుకునే వారే కరువయ్యారు. పోలీసు స్టేషన్‌కు పర్లాంగు దూరంలో నెలకొంటున్న ఈ సమస్యను చక్కదిద్దేందుకు కనీసం పోలీసు కూడా కనిపించడం లేదు. ఇక పంచాయతీ సిబ్బంది తమకేమీ సంబంధం లేదన్నట్టుగా ఆశీలు వసూలుతోనే సరిపెట్టుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ప్రతిరోజు సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల వరకు ట్రాఫిక్ సమస్య వేధిస్తోంది.



రాజానగరంలోని గాంధీ బొమ్మ సెంటర్‌లో నిలిచిపోయిన బస్సులు

12న రాజమహేంద్రి ఆర్కెస్ట్రా వార్షికోత్సవం

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): రాజమహేంద్రి ఆర్కెస్ట్రా 29వ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం ఉదయం 10 గంటలకు పాటల పోటీలు, సాయంత్రం ఆర్కెస్ట్రా కళాకారులతో నాడు నేడు సంగీత విభావరి నిర్వహించనున్నారు. ఈ మేరకు శుక్రవారం ఇన్నీసుపేటలోని రాజమహేంద్రి ఆర్కెస్ట్రా ఆర్గనైజర్ ఎం.దుర్గాఫణికుమార్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన, నటుడు, గాయకుడు జిత్‌మోహన్‌మిత్ర మాట్లాడారు. ఆదివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 4 గంటల వరకు సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ విభాగాలలో సినిమా పాటలు, లలిత గీతాలు, భక్తి గీతాల పోటీలు నిర్వహిస్తామన్నారు. సాయంత్రం 5 గంటలకు 'నాడు నేడు' పేరిట రాజమహేంద్రి ఆర్కెస్ట్రా కళాకారులతో సంగీత విభావరి జరుగుతుందన్నారు. పాటల పోటీలో పాల్గొనే వారు 98491 98900, 70365 27411 నంబర్లను సంప్రదించాలన్నారు. సమావేశంలో పట్నాల శ్రీనివాస్, జి.రత్నరాజ్, డబ్ల్యూఎస్ఎస్‌సీ కౌశిక్, ఎస్.శివ, ఒంపోలు గోపాలకృష్ణ, ఎం.పెదబాబు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిత్‌మోహన్‌మిత్ర, దుర్గా ఫణికుమార్

జింక కళేబరానికి పోస్టుమార్టం

కడియం: మండలంలోని కడియపులంక పంచాయతీ పరిధిలో జింక కళేబరానికి అటవీ, రెవెన్యూ అధికారుల సమక్షంలో పోస్టుమార్టం నిర్వహించి, దహనం చేశారు. గోదావరి లంకల్లో ఉండే జింకలు వివిధ కారణాలతో ఒడ్డుకు చేరుతున్నాయి. వాటిపై కుక్కలు దాడి చేస్తున్నాయి. ఇదే విధంగా కుక్కల దాడిలో తీవ్రంగా గాయపడిన జింకను స్థానికులు గుర్తించారు. కడియపులంక సర్పంచ్ మార్గాని అమ్మాణికి విషయం తెలియజేయడంతో వారు అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. రాజమహేంద్రవరం ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ శివప్రసాద్, బీట్ ఆఫీసర్ ఆనంద్ ఘటనా స్థలానికి వచ్చేసరికే జింక మృతి చెందింది. దీంతో వెటర్నరీ వైద్యులు కిరణ్, వీఆర్వో జ్యోతి సమక్షంలో జింక కళేబరానికి నిబంధనల ప్రకారం పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం కళేబరాన్ని దహనం చేశారు.



జింక కళేబరానికి పోస్టుమార్టం నిర్వహిస్తున్న అధికారులు

ఆర్ట్స్ కళాశాల వద్ద ధర్నా

కంబాలచెరువు: విద్యా పరిరక్షణ సమితి ఆంధ్రప్రదేశ్ ఇచ్చిన పిలుపు మేరకు రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల వద్ద శుక్రవారం నూతన విద్యా విధానానికి వ్యతిరేకంగా ధర్నా జరిగింది. కార్యక్రమంలో ఏపీటీఎఫ్, పీడీఎస్‌యూ, డీటీఎఫ్, ఏఐఎస్ఎఫ్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

శివరాత్రి వేడుకలకు శ్రీకారం

కడియం: స్థానిక భ్రమరాంబికా సమేత మల్లేశ్వర స్వామి ఆలయం వద్ద శివరాత్రి వేడుకల ఏర్పాట్లకు శుక్రవారం శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా పందిరి రాటను నాటి ఏర్పాట్లు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకుడు అప్పిలి శ్రీమన్నారాయణ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక భక్తులు, దేవదాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే దుళ్లలోని బాలాత్రిపుర సుందీర సమేత అగస్తేశ్వరస్వామి ఆలయం, వీరవరం, మురమండ గ్రామాల్లోని సోమేశ్వరాలయం, కడియపులంకలోని అపర్ణా సమేత అనంతేశ్వరాలయం, జేగురుపాడు నగరేశ్వరాలయం, వేమగిరి శివాలయాల్లో శివరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.

కోనసీమ కొబ్బరిపై డాక్యుమెంటరీ

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): కోనసీమ కొబ్బరి పరిశ్రమ గురించి కల్పవృక్షం పేరిట డాక్యుమెంటరీ తీస్తున్నట్లు దర్శక, నిర్మాత డాక్టర్ నిట్టల గోపాలకృష్ణ తెలిపారు. జిత్ మోహన్ కళావేదిక దగ్గర శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కొబ్బరి చెట్టు ద్వారా వచ్చే బొండాలు, కాయలు, ఇతర ఉత్పత్తులపై 20 నిమిషాల నిడివిలో డాక్యుమెంటరీ తీస్తున్నామన్నారు. రెండు రోజులపాటు చిత్రీకరణ ఉంటుందన్నారు. జిత్ మోహన్ మిత్రా, సినిమా విశ్లేషకులు ఎస్వీ రామారావు, కెమెరామెన్ భాస్కర్, ప్రొడక్షన్ ఆర్గనైజర్ రాధాకృష్ణ, అసిస్టెంట్ డైరెక్టర్ రాజు, వి.జగపతి, బీఎస్ఎన్ఎల్ మూర్తి, డాక్టర్ గిరజాల సోమరాజు నాయుడు పాల్గొన్నారు.